క్లుప్తంగా

అందుబాటులో యూరియా

ముధోల్: మండలంలోని బిద్రెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్ తెలిపారు. డీఏపీ బస్తా రూ.1350, 20:20:0:13 రూ.1100, యూరియా రూ.267గా ఉందని.. కావాల్సిన రైతులు ఆధార్ తీసుకొని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వాహనదారులకు అవగాహన

ముధోల్: ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని ఎస్సై సాయికిరణ్ పేర్కొన్నారు. బుధవారం ముధోల్‌లో వాహనాదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. వేగంగా, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

లక్ష్మీనరసింహుడికి అభిషేకం


అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగపూర్ గ్రామాల సమీపంలో ఉన్న శ్రీ అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం లక్ష్మీనరసింహుడికి అభిషేకం, పూజాది కార్యక్రమాలు నిర్వహించినట్లు అర్చకులు వొద్దిపర్తి వెంకటరమణాచార్యులు తెలిపారు.

నూతన కార్యవర్గం


యూనియన్ సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారంలో మహాపోచమ్మ ఆలయం వద్ద బుధవారం కా రు యూనియన్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కారు యూనియన్ మండలాధ్యక్షుడిగా దమ్మగొని బాబు గౌడ్, ఉపాధ్యక్షుడిగా సుమన్ యాదవ్, కోశాధికారిగా లింగారావు, సభ్యులుగా పోతుగంటి అశోక్, శనిగారపు రాకేశ్, తొడిశెట్టి నితీశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

టీఏ, డీఏలు ఇవ్వాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న ఆశాకార్యకర్తలు

కడెం: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వర్తించిన ఆశకార్యకర్తలకు టీఏ, డీఏలు చెల్లించాలని ఆశవర్కర్ల సంఘం మండలాధ్యక్షురాలు జ్యోతి కోరారు. బుధవారం ఈ విషయమై తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించకుంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు. ధనలక్ష్మీ, పార్వతి, దేవిక తదితరులున్నారు.

శుద్ధజల యంత్రం అందజేత


ప్రారంభిస్తున్న దాత

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భ క్తులకు తాగునీటిని అందించేందుకు ఖానాపూర్‌కే చెందిన గడ్డం సంధ్య-కిషన్‌రెడ్డి దంపతులు బుధవారం రూ.30 విలువైన శుద్ధజల యంత్రం(వాటర్ ఫ్రిడ్జ్) ఏర్పాటు చేశారు. అర్చకులు చక్రపాణి నర్సింహచార్యులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు నీటిని అందించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అడ్డగట్ల రాజన్న, నిమ్మల రమేశ్, కోశాధికారి సుధాకర్, ఉపాధ్యక్షులు లింగాల రాము, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు


పీచరలో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీ

లక్ష్మణచాంద: మండలంలోని పీచరకు చెందిన గుర్రం నరేశ్, వినీత్.. తమ తండ్రి బొర్రన్న, మేనమామ బూసి గంగయ్యల జ్ఞాపకార్థం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. పీచరలో మూడు, రాచాపూర్‌లో రెండు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఒక్కో బెంచీకి రూ.2900 చొప్పున రూ.14,500తో ఐదు బెంచీలు ఏర్పాటు చేశారు.

జోరుగా ఇసుక అక్రమ దందా

- సరిహద్దు గ్రామాల్లో డంపులు
- రాత్రివేళల్లోనే రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న తానూరు పోలీసులు


సింగన్‌గాంలో రోడ్డుపై డంప్ చేసిన ఇసుక కుప్పలు

తానూరు: చిమ్మ చీకట్లో రెవెన్యూ అధికారుల కళ్లు గప్పి మండలంలోని జౌలా(బి), తొండాల, ఎల్వ గ్రామాల్లోని వాగుల నుంచి ఇసుకను అనుమతుల్లేకుండా యథేచ్ఛగా తరలిస్తున్నా.. అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. మరోవైపు కొందరు వ్యాపారులు నిజామాబాద్ జిల్లా బోధన్, మహారాష్ట్రలోని ధర్మాబాద్, కారేగాం ప్రాంతాల నుంచి కూడా కొందరు ఇసుకను అక్రమంగా డంప్ చేసుకుంటున్నారు. అర్ధరాత్రి వాగుల నుంచి ట్రాక్టర్ల ద్వారా.. మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుంచి టిప్పర్ల ద్వారా తీసుకొచ్చిన ఇసుకను సరిహద్దు గ్రామాల్లో డంపు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఈ దందా జోరుగా సాగుతోంది.

రాత్రి రవాణా..

తానూరు మండలంలోని జౌలా(బి), తొండాల వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇక్కడ వీలు కాకుంటే మహారాష్ట్ర వ్యాపారులతో కుమ్మక్కై ధర్మాబాద్, కారేగాం నుంచి అక్రమంగా టిప్పర్ల ద్వారా ఇసుకను తీసుకొచ్చి సరిహద్దు ప్రాంతాలైన జౌలా(బి), ఎల్వత్, కోలూరు, సింగన్‌గాం, ఎల్విత్, వాడవనలో లేదా, తానూరు శివారులో ఇసుకను డంపు చేస్తున్నారు. కొందరు అక్రమార్కులు డంప్ చేసిన ఇసుకను మరుసటి రోజుకల్లా చేరాల్సిన ప్రాంతానికి చేరవేస్తూ దందా సాగిస్తున్నారు. మరికొందరు ఏజెంట్లుగా మారి ఇక్కడి అధికారులతో బేరాలు చేసుకుని రాత్రి ఇసుక కుప్పలను నిల్వ చేసి అవసరం ఉన్న వారికి అధిక ధరకు విక్రయిస్తున్నారు.

వ్యాపారం సాగుతోందిలా ...

తానూరు మండలంలోని కొందరు వ్యాపారులు అభివృద్ధి పనుల పేరిట సరిహద్దు ప్రాంతాల్లోని ఎల్వత్, తొండాల, వాడవన వాగుల నుంచి ఇసుకను తోడి ట్రాక్టర్ల ద్వారా జౌలా(బి), తానూరు శివారు ప్రాంతాల్లో నిల్వ చేసుకుంటున్నారు. మరికొందరు బడా వ్యాపారులు మహారాష్ట్రలోని ధర్మాబాద్, కారేగాం వ్యాపారులతో కుమ్మక్కై ఇసుకను తక్కువ ధరకు తెప్పించుకొని ఇక్కడి వారికి అధిక ధరలకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. పక్షం రోజుల కిందట పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

అనుమతి లేకుండా వాగుల నుంచి మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా మండలానికి తీసుకొస్తున్న అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అప్పుడప్పుడు పోలీసులు నామమాత్రపు దాడులు చేసి ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నా.. అక్రమ రవాణా ఆగడం లేదు. మహారాష్ట్ర నుంచి టిప్పర్లలో ఇసుకను తెచ్చి దందా సాగిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అక్రమ ఇసుక దందాను కట్టడి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. సరిహద్దు ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం

– లింగంమూర్తి, తహసీల్దార్

తేమశాతం పేరిట కోత విధించొద్దు

సోన్: కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం పేరిట ధాన్యంలో కోత విధించొద్దని ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని న్యూవెల్మల్‌లో జిల్లా రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తూకం వేయాలని సిబ్బందికి సూచించారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో తోట సాయన్న, బొల్లి మహేందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


న్యూవెల్మల్‌లో తేమ పరిశీలిస్తున్న రాజేందర్


గొల్లమాడలో తేమ పరిశీలిస్తున్న ఏఈఓ గణేశ్

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ, అర్లి(కే), చాక్‌పల్లి, బూరుగుపల్లి(కే) వరి ధాన్యాల కొనుగోలు కేంద్రాలను క్లస్టర్ ఏఈఓలు గణేశ్, భాగ్యలక్ష్మి, రమ్య పరిశీలించారు. గొల్లమాడ కొనుగోలు కేంద్రంలో ధాన్యంలో తేమ శాతాన్ని ఏఈఓ గణేశ్ పరిశీలించారు. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించినందున ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోస్కుల భూమేశ్, మురళి, సంతోష్, ప్రవీణ్ పాటిల్ పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్లతో ఇక్కట్లు

- కొనసాగుతున్న వంతెనల నిర్మాణం
- వర్షాలు ప్రారంభమైతే రాకపోకలకు ఇబ్బందులే..
- ఆందోళనలో వాహనదారులు, ప్రజలు


తర్లపాడ్ అప్రోచ్‌రోడ్డుపై వెళ్తున్న వాహనాలు


దిలావార్‌పూర్ మార్గంలో కొనసాగుతున్న వంతెన పనులు

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్, అంబేడ్కర్‌నగర్ శివారు ప్రాంతంలో రెంకోని వాగుపై చేపట్టిన రెండు వంతెనల నిర్మాణ పనులు నాలుగు నెలలుగా కొనసాగుతున్నాయి. దీంతో వంతెనల నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక అప్రోచ్ రోడ్డుతో వాహనదారులకు ఇప్పట్లో తిప్పలు తప్పేలా లేవు. అధికారులు ప్రత్యేక చొరవతో శరవేగంగా పనులు చేయిస్తే తప్ప వర్షాకాలంలో వంతెన మీదుగా వాహనాలు వెళ్లలేవు. ఏటా వర్షాకాలంలో చిరుజల్లులకే పొంగి పొర్లే రెంకొనివాగు మార్గంలో పెద్ద సంఖ్యలో గ్రామాలు ఉండడంతో వాహనదారుల కష్టాలు వర్ణనాతీతంగా మారనున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు వంతెనల నిర్మాణాలకు రూ.9.90 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో ఆర్అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టాల్సి ఉంది. దీంతో మాజీ (అప్పటి) ఎమ్మెల్యే రేఖా నాయక్ భూమి గతేడాది మే మాసంలో పనుల ప్రారంభానికి భూమి పూజ చేసినప్పటికీ వెంటనే వర్షాకాలం రావడంతో పనులు ప్రారంభించలేదు. ఇటీవల నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జనవరి 27న పనులను ప్రారంభించారు.

రోడ్డు కొట్టుకుపోకముందే స్పందించాలి

ఏటా వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే వరద పాతవంతెనపై నుంచి పొంగిపొర్లేది. దీంతో వంతెన దెబ్బతింది. ప్రస్తుతం నూతన వంతెన నిర్మాణ పనుల సమయంలో ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు మట్టితో నిర్మించింది కావడంతో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అధికారులు పనులను త్వరగా పూర్తి చేయాలి. – బీరయ్య, తర్లపాడ్

శరవేగంగానే పనులు..

ప్రారంభమైన నాలుగు నెలల్లోనే 60 శాతం మేర పనులు పూర్తి చేశారు. ఇప్పటికే బెడ్ బ్లాక్ లెవల్ పనులు పూర్తయ్యాయి. స్లాబు పనులు సైతం సకాలంలో పూర్తయితే వాహనాలు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుంది. పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లకు మరో ఆరు నెలలు గడువు ఉంది. కానీ ప్రజల సౌకర్యార్థం వేగంగా వంతెనల నిర్మాణ పనులు చేయాలని కోరాం.

– విజయలక్ష్మి, ఆర్అండ్‌బీ ఏఈ

రెండు వంతెనలు, అనేక గ్రామాలు..

పట్టణ శివారులోని గాంధీనగర్ వంతెన మార్గం ద్వారా నిర్మల్–మంచిర్యాల జిల్లాలకు వెళ్లే ప్రధాన రోడ్డు ఉండడంతో ఈ మార్గం నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రూ.4.70 కోట్లతో ఈ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. అంబేడ్కర్‌నగర్ శివారులోని దిలావర్‌పూర్ వెళ్లే మార్గంలో చేపట్టిన వంతెన నిర్మాణానికి రూ.5.20 కోట్లతో పనులు చేపట్టారు. ఈ మార్గంలో ఖానాపూర్, కడెం మండలాలకు చెందిన సుమారు 20 గ్రామాలు ఉన్నాయి. దీంతో ఆయా చోట్ల పనులు ప్రారంభం కావడంతో పక్కనే తాత్కాలికంగా అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఇది వరకు దుమ్ముధూలితో ఇబ్బంది పడిన వాహనదారులకు, ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్డు బురదమయంగా మారి ప్రజల ఇక్కట్లకు కారణమవుతుంది. భారీ వర్షం కురిస్తే తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు పనులను వేగంగా చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


నాగలక్ష్మి

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన గాజుల నాగలక్ష్మి అనే క్రీడాకారిణి ఈనెల 21న పుణెలో నిర్వహించే జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న క్రీడాకారిణికి జిల్లా వాసి అయిన గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ నిర్వాహకుడు కడారి నరేశ్ బుధవారం తన వంతుగా రూ.5 వేలను సాయంగా అందజేశారు. యువతికి సాయం అందించిన నరేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

మండల పూజ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దత్త సాయినగర్ శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయంలో మండల పూజా కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హోమం, పుణ్యాహవచనం, స్వామివారి విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక హారతి, పూలతో అలంకరించారు. అనంతర ం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బోరుకు మోటారు ఏర్పాటు

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో బోరు మోటార్ పని చేయక కాలనీవాసులు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను కౌన్సిలర్ కిశోర్ నాయక్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన చైర్మన్ వెంటనే నూతన మోటార్ ఏర్పాటు చేయించి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

ఖానాపూర్: రైతులు పండించిన పంటకు రూ.500 బోనస్ ఇస్తానని ప్రగల్భాలు పలికిన సీఎం ఇచ్చిన మాట తప్పడాన్ని నిరసిస్తూ గురువారం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం సన్నరకాలకు మాత్రమే బోనస్ ఇస్తానని అనడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో జరిగే నిరసనలో పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జనావాసాల్లో పందుల పెంపకం వద్దు


పెంపకందారులతో మాట్లాడుతున్న చైర్మన్

ఖానాపూర్: పట్టణంలోని జనావాసాల్లో పందుల పెంపకం చేపట్టడం సరికాదని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. బుధవారం పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో పలువురు పందుల పెంపకందారులకు ఈ విషయమై అవగాహన కల్పించారు. కాలనీలోని ఖాళీస్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏ ర్పాటు చేసి పందులను పెంచడం ద్వారా పరిసరాలు అపరిశుభ్రంగా మారి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. శివారు ప్రాంతాల్లోకి పందుల పెంపకం తరలించాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ మనోహర్, పరిమి సురేశ్ తదితరులున్నారు.

నర్సాపూర్(జి)లో పగటిపూట వెలుగులు


పగలు వెలుగుతున్న హైమాస్ట్ దీపం

నర్సాపూర్(జి): విద్యుదీకరణలో భాగంగా పంచాయతీ నిధులు రూ.53 లక్షలతో మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ నుంచి పెట్రోల్‌బంక్ వరకు 44 స్తంభా లకు ఎల్ఈడీ బల్బులు, మధ్యలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. కానీ ఇవి రోజంతా వె లుగుతూనే ఉంటున్నాయి. ఇందుకు నెలకు రూ.లక్ష వరకు కరెంట్ బిల్లు వస్తుంది. స్తంభాలకు పగలు కరెంటు నిలిపివేస్తే కొంత బిల్లు తగ్గే అవకాశం ఉంటుందని మండలవాసులు పేర్కొంటున్నారు.

ఆయిల్‌పాం వైపు అడుగు


లోకేశ్వరంలో ఓ రైతు సాగు చేసిన ఆయిల్‌పాం తోట

- ప్రోత్సాహంతో రైతుల ఆసక్తి
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

లోకేశ్వరం: ఎప్పుడు ఒకే రకమైన పంటలు సాగు చేయకుండా వ్యవసాయాధికారుల సూచనలతో రైతులు ఆయిల్‌పాం పంట సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఒకసారి సాగు చేస్తే 25 ఏళ్ల ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతో ప్రభుత్వం సైతం కర్షకులను ఈ పంట సాగు చేసేలా ప్రోత్సహిస్తుంది. ఎర్రమట్టి, నల్లరేగడి తదితర భూముల్లో దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉందని తేల్చారు. నీటి వసతితోపాటు తేమ శాతం అధికంగా ఉండే భూములు ఈ పంట సాగుకు అనుకూలం. ఎకరాకు 50 మొక్కల వరకు నాటవచ్చు. మొక్కల మధ్యలో అంతర పంటలుగా కూరగాయలు, ఆరుతడి పంటలను సాగు చేయవచ్చు.

సబ్సిడీపై మొక్కలు, నిర్వహణకు సాయం..

ఆయిల్ పాం సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై మొక్కలు అందజేసింది.పంటకు నీటి తడులు అందించడానికి అవసరమయ్యే డ్రిప్ పరికరాలను ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీలకు 90 శాతం సబ్సిడీపై ఇస్తోంది. ఏటా నిర్వహణ ఖర్చుల కింద ఎకరాకు రూ.4200 చొప్పున నాలుగేళ్ల వరకు అందిస్తోంది. నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి ప్రారంభమై.. క్రమేణా పెరుగుతుంది.

జిల్లాలో 7,219 ఎకరాల్లో..

జిలాల్లో 2,302 మంది రైతులు 7,219ఎకరాల్లో ఆయిల్ పాం సాగు చేస్తున్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగుకు ఆసక్తి ఉన్నవారి వివరాలు నమోదు చేసి శిక్షణ ఇస్తున్నారు.

అంతర పంటలు సాగు చేశా



నాకున్న 10 ఎకరాల్లో ఆయిల్ పాం పంట సాగు చేస్తున్నా. ఇందులో అంతర పంటలుగా సోయా, మొక్కజొన్న పంటలను పండిస్తున్నా. ఆ యిల్ పాం గింజలు వచ్చే వరకు సమీపంలోనే మార్కెట్ సౌకర్యం కల్పించాలి. అవగాహన కల్పిస్తే మరికొందరు ఈ పంట సాగు చేసేందుకు ముందుకొస్తారు.

– గజ్జేల చిన్నక్క, మహిళా రైతు, ముజిగి

మంచి డిమాండ్ ఉంది..

ఆయిల్‌పాం సాగు చేస్తే నాలుగేళ్ల తర్వాత మొదటి పంట వస్తుంది. ఆ తర్వాత దిగుబడి మొదలై ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఈపంటకు మంచి డిమాండ్ ఉంది. అడవి జంతువుల బెడద ఉండదు. సాగుకు రైతులు ముందుకురావాలి.

– అలియా షాథిమా, జిల్లా ఇన్‌చార్జి ఉద్యానశాఖ అధికారి

రైతుల్లో పెరిగిన నమ్మకం..

జిల్లాలో ఆయిల్‌పాం పంట సాగు ప్రోత్సాహానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆదాయం పెరుగుతుందని దీని సాగుపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించడంతో కొందరు రైతులే ముందుకొచ్చారు. ఇప్పుడు క్రమేణా ఆయిల్‌పాం సాగు చేసేవారి సంఖ్య పెరుగుతోంది.

అటెన్షన్ ప్లీజ్.. ఆదమరిస్తే అంతే..



సారంగపూర్: మండలంలోని సాయినగర్ నుంచి జామ్ గ్రామం వెళ్లే మార్గంలో నిర్మల్-స్వర్ణ ప్రధాన రోడ్డు వర్షాకాలంలో కోతకు గురైంది. రోడ్డు కింద మట్టి కొట్టుకుపోవడంతో తారు మాత్రమే మిగిలింది. వాహనదారులు గమనించకుండా వెళ్తే అందులో పడిపోయి ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. అధికారులు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : శారిక్ అలీ, ఆర్అండ్‌బీ ఏఈ ఫోన్: 94408 19092